కిడ్నీ పరీక్షలు విధిగా చేసుకోవాలి..

ఉద్దానం వాసులకు
జిల్లా జడ్జి సూచన

విశాలాంధ్ర-శ్రీకాకుళం : ఉద్దానం ప్రాంతాన్ని ఎన్నో ఏళ్ళుగా పట్టిపీడిస్తున్న కిడ్నీ భూతాన్ని తరిమికొట్టేందుకు ప్రభుత్వాలతోపాటు సామాజిక, స్వచ్ఛంద సంస్థలు కలిసికట్టుగా ముందుకు రావాలని శ్రీకాకుళం జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా పిలుపునిచ్చారు. శనివారం శ్రీకాకుళంలో జిల్లా కోర్టు ఛాంబర్‌లో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉద్దానం ప్రాంత ప్రజలు అందరూ విధిగా వైద్య పరీక్షలు చేసికోవాలని సూచించారు. ప్రాథమిక స్థాయిలో కిడ్నీ వ్యాధిని గుర్తిస్తే కొంత వరకు మరణాల రేటు నివారించేందుకు అవకాశం ఉంటుందన్నారు. సామాజిక, మానవతా దృక్పథంతో శ్రీకాకుళం జిల్లా న్యాయ వ్యవస్థ అంతా కలిసికట్టుగా ఉద్దానం ప్రాంతంలో కిడ్నీ ప్రభావిత ప్రాంతాల్లో పర్యటిస్తూ ప్రజలకు పెద్దఎత్తున అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఇంత వరకు శ్రీకాకుళం జిల్లా న్యాయ స్థానం ఆధ్వర్యంలో నాలుగు మండలాల్లో 3 వైద్య శిబిరాలు,మూడు న్యాయ విజ్ఞాన సదస్సులు ఏర్పాటుచేశామని, తద్వారా మూత్ర పిండాలు వ్యాధిబారిన పడకుండా ఉండేం దుకు ఉద్దానం వాసులకు అవగాహన కల్పిస్తున్నా మని అన్నారు. మానవతా వాదులంతా కలిసి ముందుకు వచ్చి ఉద్దానానికి పూర్వ వైభవం వొచ్చే విధంగా కృషి చేయాలని కోరారు.. ఉద్దానం ప్రాంతంలో ఉన్న వారు అంతా విధిగా వైద్యపరీక్షలు జరుపుకోవా లని, కిడ్నీ వ్యాధి సోకిన వ్యాధిగ్రస్తులు అంతా వైద్యులు సూచించిన మందులు విధిగా వాడాలని ఆయన సూచించారు. ఫిబ్రవరి 11న మెగా లోక్‌అదాలత్ ఏర్పాటు చేశామని, కక్షిదారులు సంపూర్ణ సహకారాన్ని అందించాలని జిల్లా జడ్జి కోరారు. లోక్‌అదాలత్‌లలో కేవలం క్రిమినల్ కేసులు ఎక్కువ సంఖ్యలో పరిష్కారానికి వస్తున్నా యని, సివిల్ కేసులు కూడా రావాలని, ఇందుకు న్యాయవాదులు, కక్షిదారులు సహకరించాలని ఆయన కోరారు.

- మనోవికాస కేంద్రాన్ని సందర్శించి జిల్లా జడ్జి... రాష్ట్ర న్యాయ సేవ అధికార సంస్థ రూపొందించిన స్టేట్ ప్లాన్ ఆఫ్ యాక్షన్ కు అనుగుణంగా జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ అధ్యక్షులు, శ్రీకాకుళం జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా స్థానిక కలెక్టరేట్ వద్ద ఉన్న బెహరా మనోవికాస కేంద్రంను సంద ర్శించారు. ఈ సందర్భంగా మనోవికాస కేంద్రం నిర్వాహకులను మనోవికాస కేంద్రంలో ఉంటున్న విద్యార్థులకు అందుతున్న వసతి భోజన సౌకర్యాలు వారి ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసు కున్నారు. ఈ సందర్భంగా జిల్లా జడ్జి మనోవికాస కేంద్రంలోని విభిన్న ప్రతిభావంతుల వివరాలు అన్నీ అడిగి తెలుసుకున్నారు. విభిన్న ప్రతిభా వంతులలో ఎవరికైనా న్యాయ సహాయం కావాల్సి వస్తే నిర్వాహకులు న్యాయసేవ అధికార సంస్థకు తెలియజేయాలని ఉచితంగా న్యాయ వాదిని నియమిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమం లో వికాస కేంద్ర నిర్వాహకులు శేఖర్, శ్యామల జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జ్ ఆర్.సన్యాసినాయుడు, న్యాయవాది ఇందిరాప్రసాద్ పాల్గొన్నారు. తదుపరి జిల్లా జడ్జి విశాలాంధ్ర వారు రూపొందించిన క్యాలెండర్‌ను, డైరీని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మీడియా అధ్యక్షులు శాసపు జోగినాయుడు పాల్గొన్నారు.

ప్రజా బాంధవుడు సీఎం జగన్మోహన్ రెడ్డి

- సంక్షేమ రాజ్యంలో సుభిక్షంగా ప్రజానీకం
- ఏపీ శాసనసభాపతి తమ్మినేని సీతారాం

విశాలాంధ్ర-బూర్జ: రాష్ట్ర ప్రభుత్వం వైద్య రంగం పురోగతికి నిర్దిష్టమైన ప్రణాళికలతో అడుగులు వేస్తుందని ఏపీ శాసనసభాపతి తమ్మినేని సీతారాం పేర్కొన్నారు. శనివారం బూర్జ మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. మండలం ఉప్పాడ వెంకంపేటలో 17.50 లక్షల అంచనాలతో నిర్మించిన వైయస్సార్ విలేజ్ క్లినిక్ భవన సముదాయాన్ని ఆయన ప్రారంభించారు. లచ్చయ్యపేట గ్రామంలో నాడు నేడు రెండవ దశ కార్యక్రమంలో భాగంగా 25 లక్షల అంచనాలతో భవనాల ఆధునికరణ సుందరీకరణ చేపట్టారు. వాటిని స్పీకర్ తమ్మినేని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వైద్య రంగాన్ని గ్రామస్థాయిలో ప్రతి ఒక్కరికి అందుబాటులోకి తీసుకువచ్చేందుకు వైఎస్ఆర్ విలేజ్ క్లినిక్‌లను ప్రారంభించిందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో వైద్యం ప్రతి ఒక్కరికి అందుబాటులోకి తీసుకువచ్చేలా వైద్య సిబ్బందిని నియామకం చేసే చర్యలను చేపట్టిందన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఫ్యామిలీ డాక్టర్ (ఫ్యామిలీ ఫిజిషియన్) ప్రోగ్రాంను ప్రజలు సద్వినియోగపరుచుకుంటున్నారన్నారు. ప్రతీ సచివాలయం పరిధిలో ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు గ్రామంలో అందుబాటులో ఉంటున్న విషయాన్ని గుర్తు చేశారు. ఎవరికి ఎటువంటి సమస్య ఉన్న జనరల్ ఓ.పి చూసి వారికి ఏదైనా సమస్య ఉంటే 14 రకముల పరీక్షలు నిర్వహిస్తున్నారన్నారు. వారివద్ద 67 రకాల మందులు అందుబాటులో ఉంటాయన్నారు. ఈ కార్యక్రమాన్ని గ్రామాల్లో ప్రజానీకం ఉపయోగించుకుంటున్నారన్నారు. ఎమ్మెల్సీ రఘురాజు మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో ఇప్పటి నుండే ఎమ్మెల్యేల నుండి పార్టీ నుండి విజయం సాధించిన ప్రతి ఒక్కరూ ప్రతి గ్రామంలో గడపగడపకు వెళ్లి, ముఖ్యమంత్రి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అభివృద్ధి గురించి వివరించాలని కోరారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కర్నేణా దీప, జెడ్పీటీసీ బెజ్జిపురపు రామారావు, మండల పార్టీ అధ్యక్షులు రాష్ట్ర ఔట్ సోర్సింగ్ డైరెక్టర్ ఖండపు గోవిందరావు, వైస్ ఎంపీపీలు బుడుమూరు సూర్యారావు, కరణం కృష్ణం నాయుడు, డిసిఎంఎస్ డైరెక్టర్ జల్లు బలరాం నాయుడు మార్కెట్ కమిటీ మాజీ అధ్యక్షులు గుమ్మడి రాంబాబు, పిఎసిఎస్ అధ్యక్షులు బగాది నారాయణమూర్తి, మండల పార్టీ కన్వీనర్ ఐ వెంకట్రావ్, స్థానిక సర్పంచులు మెట్ట అమ్మాజీ, సురపు ఉదయ్, వైఎస్ఆర్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, సర్పంచులు, ఎంపీటీసీ అధికారులు పాల్గొన్నారు.

జర్నలిజం విలువలు కాపాడే పత్రిక విశాలాంధ్ర

జిల్లా న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా

విశాలాంధ్ర-శ్రీకాకుళం : విలువలతో కూడిన జర్నలిజం చేసిన వ్యక్తులకు సమాజంలో మంచి గుర్తింపు, గౌరవం ఉంటుందని శ్రీకాకుళం జిల్లా ప్రధాన న్యాయ మూర్తి జునైద్ అహ్మద్ మౌలానా అన్నారు. శనివారం శ్రీకాకుళంలో జిల్లా న్యాయ మూర్తి చాంబర్‌లో విశాలాంధ్ర దినపత్రిక ప్రచురించిన నూతన సంవత్సర క్యాలెండర్, డైరీని ఆవిష్కరించారు. సమాజంలో పాత్రికేయుల పాత్ర కీలకమైందని ఆదిశగా పరిశోధనాత్మక జర్నలిజంపై పాత్రికేయులంతా దృష్టి సారించాలని ఆయన ఆకాంక్షించారు. విశాలాంధ్ర దినపత్రికకు సుదీర్ఘ కాల చరిత్ర ఉందని, ఎన్నో ప్రజా ఉద్యమాలకు ఊతం ఇచ్చిన పత్రిక విశాలాంధ్ర అని కొనియాడారు. ఈకార్యక్రమంలో లోక్ అదాలత్ న్యాయమూర్తి ఆర్.సన్యాసినాయుడు, విశాలాంధ్ర లీగల్ రిపోర్టర్ గేదెల ఇందిరా ప్రసాద్, జిల్లా ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షులు శాసపు జోగినాయుడులు పాల్గొన్నారు.

దళిత సమాజిక వర్గానికి పిఏసీఎస్ పదవి ఇవ్వాలి

దళిత నేత, వైసీపీ నాయుకులు చుక్కా రాంబాబు

విశాలాంధ్ర-కొత్తూరు : కొత్తూరు పిఏసీఎస్ (ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం) చైర్మన్ పదవి ఇవ్వాలని దళిత నేత, వైసీపీ నాయుకులు చుక్కా రాంబాబు ఒక ప్రకటనలో కోరారు. ఈమేరకు ఆయన శనివారం ఇక్కడ మీడియా కు ప్రకటన విడుదల చేశారు. ఇప్పటి కి రెండు పర్యాయాలు ఒకే సమాజిక వర్గానికి చెందిన నాయుకునికి పిఏసీఎస్ చైర్మన్‌గా ఎమ్మెల్యే రెడ్డి శాంతి సూచనలతో నామినేట్ చేశారు. ఈసారి దళిత సామాజిక వర్గానికి ఈ అవకాశం ఇవ్వాలని, ఇది మా న్యాయమైన డిమాండ్ అని ఆయన అన్నారు. ఏదైనా అందరి అభిప్రాయాలు తీసుకొని పార్టీ పటిష్టత దృష్ట్యా ఎమ్మెల్యే రెడ్డి శాంతి తమ వినతిని పరిశీలించాలన్నారు.

చివరి గింజ వరకూ కొనుగోలు చెయ్యాలి : కూన

విశాలాంధ్ర-బూర్జ : మండలంలోని గుత్తావల్లి, నీలదేవీపురం, తుడ్డలి, డొంకలపర్త గ్రామాలలోని ఇటీవల మరణించిన కుటుంబాలను మాజీ ఎమ్మెల్యే కూన రవికుమార్ శనివారం పరామర్శించారు. అనంతరం మీడియాతో ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం రైతులను రోడ్డున పడేసిందని మండిపడ్డారు. ధాన్యం కొనగోలు విషయంలో పలు రకాల ఆంక్షలు విధించి వైఫల్యం చెందిందని అన్నారు. తెలుగు యువత ఉపాధ్యక్షుడు ఆనెపు రామకృష్ణం నాయుడు మాట్లాడుతూ కల్లంలో దలారులు కొనుగోలు చేస్తుంటే అధికారులు చూసీ చూడనట్టు వ్యవహరిస్తున్నారని అన్నారు. రైతుల వద్ద నుండి చివరి గింజ వరకూ కొనుగోలు చేసి రైతుకు న్యాయం చెయ్యాలని, లేనిపక్షంలో రైతులతో కలిసి కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసనకు సిద్ధపడతామని హెచ్చరించారు. నియోజకవర్గంలో 11 వేల మెట్రిక్ టన్నులు దాన్యం కొనుగోలు జరగాల్సి ఉందని తెలియజేశారు. నేటికి నాలుగు లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే కొనుగోలు చేసినట్టు గణాంకాలు చెబుతున్నాయని తెలిపారు. వాలంటరీ వ్యవస్థ ఒక బూటకమన్నారు. స్థానికులు సైతం పలు సమస్యలను ఆయన వద్ద ప్రస్తావించగా వాటి పరిష్కారానికి రవికుమార్‌తో కలిసి ఎంత దూరమైనా వెళ్లడానికి సిద్ధంగా ఉన్నానని ఆనెపు తెలియజేశారు. ఈకార్యక్రమంలో కే.గోవిందరావు, గోపి మాస్టర్, ఎ.గణపతి, జె.కృష్ణ, చిన్నమనాయుడు, బెనర్జీ, సోమినాయుడు, కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

రెండవ రోజు మంచి నీటి సరఫరా కార్మికుల సమ్మె

విశాలాంధ్ర-మందస : మందస మండలం మొకరజీల్ వద్ద నున్న పంపు హౌస్ వద్ద రక్షిత మంచి నీటి సరఫరా కార్మిక సంఘం రెండవ రోజు శనివారం సమ్మె కొనసాగించారు. ఈ శిబిరం వద్దకు అర్ దబ్లు ఏస్ అధికారులు వచ్చి యూనియన్ నాయకులతో చర్చలు జరిపారు. చర్చలు విఫలమవ్వగా అధికారులు వెనుదిరిగారు. జిల్లా రక్షిత మంచినీటి సరఫరా కార్మిక సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు చావర వెంకటరమణ, నాయకులు ఢిల్లి, రాము, తులసి, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

దళిత మహిళపై దాడి

- లైంగిక వాంఛ తీర్చలేదని చంపుతామని బెదిరింపు
- పోలాకి పోలీస్ స్టేషన్‌లో అట్రాసిటీ కేసు నమోదు

విశాలాంధ్ర-పోలాకి : మూత్ర విసర్జనకు వెళ్లిన మహిళపై లైంగిక వాంఛ తీర్చమంటూ దాడి చేసి, తిరస్కరించిన మహిళకు సంబంధిన గడ్డికుప్పను కాల్చివేసి, కులం పేరుతో దూషించిన వ్యక్తిపై ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసును పోలాకి పోలీసులు నమోదు చేశారు. పోలాకి మండలం బెలమర గ్రామంలో శుక్రవారం రాత్రి 8గంటల సమయంలో ఈసంఘటన జరిగినట్లు బాధితురాలు పోలీసులకు పిర్యాదు చేసింది. భాధితురాలు పిర్యాదు మేరకు సంఘటనా స్థలానికి పోలీసులు వెళ్లి పరిశీలించి ఎఫ్.ఐ.ఆర్.నెం.8/2023 తేది 21.01.2023న ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు. బాధితురాలు కథనం ప్రకారం పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. బెలమర బి.సి.కాలనీలో ఎస్సీ కులానికి చెందిన వితంతు దళిత మహిళ సబ్బి లక్ష్మి తన ఇద్దరు కుమారులతో జీవిస్తుంది. అదే గ్రామానికి చెందిన గొర్లె సత్యం అను ఆసామీ తనకు లైంగిక వాంఛ తీర్చమని వేదిస్తుదేవాడని తెలిపింది. శుక్రవారం రాత్రి 8 గంటల సమయంలో గడ్డికుప్ప ప్రక్క మూత్ర విసర్జన చేస్తున్న సమయంలో లైంగిక దాడి చేయుటకు పూనుకున్నాడని ఆ ఫిర్యాదులో పేర్కొంది. కేకలు వేయగా పారిపోయాడని, కొంత సమయం తర్వాత మరలా వచ్చి మాల లంజా కూతురా అంటూ కులం పేరుతో దూషించి, గడ్డి కుప్పను దగ్ధం చేసినట్లు, చంపుతామని బెదిరించినట్లు బాధితురాలు ఆ ఫిర్యాదు చేసింది. బాధితురాలకు అండగా దళిత హక్కుల పోరాట సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి యడ్ల గోపి, డి.హెచ్.పి.ఎస్.శ్రీనివాసరావు, చిట్ల సింహాచలం నిలిచారు. సంఘటనకు సంబంధించి ఎస్.ఐ.తో చర్చించారు.

ప్లాస్టిక్ వాడకంపై ఆకస్మిక దాడులు

విశాలాంధ్ర-సోంపేట : సోంపేట మేజర్ పంచాయతీ ఈఓ టి.హరికృష్ణ కార్యాలయ సిబ్బందితో కలిసి ప్లాస్టిక్ వాడకంపై పట్టణంలో పలు చోట్ల శనివారం ఆకస్మిక దాడులు నిర్వహించారు. పలు భోజన హోటళ్లు, దుఖాణాలు తనిఖీ చేయగా ఆయా చోట్ల ప్లాస్టిక్ కవర్ల వాడకాన్ని గమనించారు. దీనిపై ఆయా యజమానుల పట్ల ఈఓ హరికృష్ణ ఆగ్రహం వ్యక్తం చేశారు. పలు హోటళ్లకు జరిమానాగా 3వేల రూపాయలు వసూలు చేసినట్లు ఈఓ తెలిపారు. ఇకపై పట్టణంలో ఎక్కడ ప్లాస్టిక్ వాడినా వారిపట్ల కఠినమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పాత్రికేయులు కరగాన లక్ష్మీనారాయణకు ఘన సన్మానం

విశాలాంధ్ర-కవిటి: 176వ త్యాగరాజు స్వామి ఆరాధన మహోత్సవాల సందర్భంగా ఆంధ్ర ఒడిశా రాష్ట్రం సరిహద్దు గ్రామమైన టి బరంపురం గ్రామంలో నిర్వహించిన వేడుకల్లో భాగంగా కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖ దినపత్రిక శ్రీకాకుళం జిల్లా స్టాఫ్ రిపోర్టర్ కరగాన లక్ష్మీనారాయణకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన అఖిల భారతీయ యాదవ మహాసభ జాతీయ ప్రధాన కార్యదర్శి, వైఎస్ఆర్సిపి సీనియర్ నాయకులు, పిఎసిఎస్ అధ్యక్షులు నర్తు నరేంద్ర యాదవ్ అలాగే ఎఫ్‌పిఓ అధ్యక్షులు, మత్స్యకార నాయకులు, పిఎసిఎస్ డైరెక్టర్ సర్పంచ్ ప్రతినిధి కాయ భీమసేన్ చేతుల మీదుగా కమిటీ సభ్యులు సమక్షంలో ఘనంగా సత్కరించారు. నిజాన్ని నిర్భయంగా ప్రచురించే విలేఖరి ఉన్నంతవరకు సమాజం సక్రమంగా నడుస్తుందని, విలేఖరి పాత్ర సమాజానికి ఎంతో అవసరమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు,గ్రామస్తులు, కళాకారులు తదితరులు పాల్గొన్నారు.

రోటరీ సేవలు పేదలకు వరం

ఎంపీపీ దాసు

విశాలాంధ్ర-సోంపేట : సోంపేట రోటరీ క్లబ్ అందిస్తున్న అనేక రకాల సేవలు పేదలకు వరమని ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాసు పేర్కొన్నారు. సోంపేట రోటరీక్లబ్ ఆధ్వర్యంలో ఉచిత మెగా గుండె వైద్య శిబిరం శనివారం సోంపేటలో నిర్వహించారు. ఈ శిబిరాన్ని ఎంపిపి దాసు ప్రారంభిస్తూ వ్యయప్రయాసలకు వెనుకాడకుండా మంచి వైద్యులతో పేదలకు సేవలందించడం గొప్ప విషయమని అన్నారు. ఇటువంటి వైద్య సేవలు ద్వారా పేదలందరికీ ఎంతో మేలు జరుగుతుందని అన్నారు. ఈ సందర్భంగా సోంపేటతో పాటు చుట్టుప్రక్కల గ్రామాలకు చెందిన గుండె సమస్యలతో బాధ పడుతున్న రోగులు పెద్దసంఖ్యలో హాజరై ఈ శిబిరంలో వైద్య సేవలను పొందారు. కార్యక్రమంలో రోటరీక్లబ్ అధ్యక్షులు మల్లా యుగంధర్, కార్యదర్శి బెల్లాన శ్రీకాంత్, కొద్ర రవి, మల్లా వెంకటరమణ, టంకాల వెంకటరమణ, దుద్ది శ్రీనివాసరావు, వడ్డి శివశంకర్, గుండె వైద్య నిపుణులు డాక్టర్ పాల్ కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

కానిస్టేబుల్ రాత పరీక్షకు ఏర్పాట్లు పూర్తి : ఎస్ఐ ఖాదర్‌భాషా

విశాలాంధ్ర-కోటబొమ్మాళి : పోలీస్ కానిస్టేబుల్ ప్రిలిమినరీ పరీక్షలకు హాజరై అభ్యర్థులకు ఏవిధమైన అసౌకర్యాలు కలగకుండా తగిన చర్యలు తీసుకోవడం జరిగిందని స్థానిక ఎస్ఐ షేక్‌ఖాదర్‌భాషా అన్నారు. ఆయన శనివారం ఏఎస్ఐ కె.మన్మధరావుతో కలిసి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన 4 పరీక్ష కేంద్రాలను పరిశీలించారు. ఆయన ఈ సందర్భంగా విలేకర్ల తో మాట్లాడుతూ పరీక్ష కేంద్రాలకు హాజరయ్యే అభ్యర్థుల సౌకర్యార్థం కొత్తపేట బస్టాండు వద్ద హెల్ప్ డెస్కు ఏర్పాటు చేశామన్నారు. పరీక్ష కేంద్రాల చుట్టప్రక్కల ఉన్న జిరాక్స్, ఎలక్ట్రానిక్ పరికరాలు నిర్వహించే వ్యాపార సంస్థలన్నీ మూసివేయాలని ఆదేశించడం జరిగిందన్నారు. పరీక్ష కేంద్రాలకు హాజరయ్యే అభ్యర్థులు నిర్ణీత సమయానికి హాజరు కావాలన్నారు. లేనిపక్షంలో పరీక్ష కేంద్రంలోకి పంపించడం జరగదన్నారు. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు హాల్ టికెట్ పొందుపరిచిన విధముగా ఏ విధమైన ఎలక్ట్రానిక్ గాడ్జెట్స్‌గాని ఇతర పరికరాలను గాని ఎలక్ట్రానిక్ వాచీలు, సెల్‌ఫోన్‌లు అనుమంతించరని ఎస్ఐ తెలిపారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది చింతాడ దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రాంగణ నియామకాల్లో 54 మంది ఎంపిక

విశాలాంధ్ర-ఎచ్చర్ల : శ్రీ వెంకటేశ్వర ఇంజనీరింగ్ కళాశాల (ఎచ్చెర్ల)లో శనివారం నిర్వహించిన ప్రాంగణం ఎంపికలు 54 మంది ఎంపికయ్యారు. హుండై మోబిస్ ఇండియా మార్జిన్ ప్రైవేట్ లిమిటెడ్ (కియా మోటార్స్) కు అనుబంధ సంస్థలో ట్రైన్ ఇంజనీర్ పోస్టుల కోసం ఇంటర్వ్యూలు నిర్వహించగా 54మంది ఎంపికయ్యారు. వీరికి ఏడాదికి 2.4 లక్షల రూపాయలు, ఇతర సౌకర్యాలు ఉంటాయని నిర్వాహకులు తెలిపారని కళాశాల డైరెక్టర్ డాక్టర్ బుడుమూరు శ్రీరామ్ మూర్తి, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్‌సివి రమణమూర్తి నాయుడు తదితరులు అభినందించారు.

ప్రతి వ్యక్తికి స్వచ్ఛమైన నీరందించాలన్నదే లక్ష్యం

విశాలాంధ్ర-సంతబొమ్మాళి : జలజీవన్ మిషన్ ద్వారా 2024 కి ప్రతీ పౌరునికి 50 లీటర్ల సురక్షిత మంచి నీరును అందించాలనే లక్ష్యం అని ఐఈ ఎస్ మురలీకృష్ణ అన్నారు. దండుగోపాలపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో, టీమ్ లీడర్ డి.వాసుదేవరావు, బి.ఆదినారాయణ, ఇంజనీర్ ఉదయ్ కుమార్‌లతో కూడిన బృందము, జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాల దండుగోపాలపురం నందు 9, 10 తరగతుల విద్యార్థులు 174 మందికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు పి.జానకిరామయ్య, ఉపాధ్యాయులు తూట భాస్కరరావు, లక్ష్మీకాంతం, వీరభద్రరావు, ఆదికేశవరెడ్డి, చంద్రశేఖర్, లక్ష్మి, భవాని, సూర్యకాంతం, సునీత, పార్వతి, అరుణశ్రీ, ఉమ, చిన్నారావు, రాము, మార్కండేయులు, గిరి, రోజా, దయాసాగర్, శివ, మరియు పాటశాల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఇంటి నిర్మాణాలు వేగవంతం చేయండి : ఎంపీడీవో రేణుక

విశాలాంధ్ర-ఆమదాలవలస : జగనన్న ఇంటి లబ్ధిదారులు నిర్మాణ పనులు వేగవంతం చేయాలని ఎంపీడీవో ఎం రేణుక అన్నారు. శనివారం మండలంలోని కలివరం ముద్దాడిపేట లేఅవుట్ ను పరిశీలించి మాట్లాడారు. రెండు గ్రామాలకు సంబంధించి 17 మంది లబ్ధిదారులు ఎంపిక చేయగా వారిలో ఇద్దరు మాత్రమే నిర్మాణాలు పూర్తి చేస్తున్నారని తెలిపారు. మిగిలిన వారు కూడా త్వరితగతిన నిర్మాణాలు చేపట్టాలని వివరించారు. లబ్ధిదారులకు అవసరమైన అన్ని విధాల ప్రభుత్వం సహకరిస్తుందని తెలిపారు. అలాగే లే అవుట్ కు సంబంధించి అన్ని మౌలిక వసతులు కల్పించామని తెలియజేశారు. లబ్ధిదారుల ముందుకు వచ్చి నిర్మాణాలు చేపట్టాలని కోరారు. అంతపాటు ఏపీఎం కూర్మారావు హౌసింగ్ సిబ్బంది సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

అమ్మకానికి సిద్ధంగా వున్న వర్మి కంపోస్ట్ ఎరువు

విశాలాంధ్ర-కవిటి : మండలంలోని బెజ్జిపుట్టుగ చెత్తతో సంపద తయారీ కేంద్రం లో వర్మి కంపోస్ట్ ఎరువు అమ్మకానికి సిద్ధంగా వున్నట్లు సర్పంచ్ నారాయణ స్వామి, కార్యదర్శి చిన్నారి తెలిపారు. చెత్తతో సంపద తయారీ కేంద్రంలో సుమారు వెయ్యి కిలోల వర్మి కంపోస్ట్ ఎరువు అమ్మకానికి సిద్ధంగా ఉందని కిలో వర్మీ కంపోస్టు ధర పది రూపాయలు కు విక్రయిస్తున్నట్లు తెలిపారు. అవసరమైన వారు గ్రామ సచివాలయానికి గాని 7382151020 ఫోన్ నెంబర్‌కుగాని సంప్రదించాలని కోరారు.

ఇళ్ల నిర్మాణాలు త్వరగా పూర్తి చేయండి

విశాలాంధ్ర-కంచిలి : ప్రభుత్వం మంజూరు చేసిన జగనన్న కాలనీలను లబ్ధిదారులు త్వరగా పూర్తిచేయాలని జడ్పిటిసి ఇప్పిలి లోలాక్షి, ఎంపీపీ దేవదాసు రెడ్డి కోరారు. మండలంలోని మండపల్లి లేఅవుట్ వద్ద శనివారం హౌసింగ్ డే కార్యక్రమంలో భాగంగా లబ్ధిదారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి లబ్ధిదారులతో పాటు సర్పంచులు మాదిన రజని, జగబంధు దొలాయి, ప్రజాప్రతినిధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ప్రభుత్వం హౌసింగ్ శాఖ ద్వారా లక్ష 80వేల రూపాయలు ఇస్తుందన్నారు. అలాగే వెలుగు శాఖ ద్వారా 1,50,000 రుణం సైతం మంజూరు చేయడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాలను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకొని, ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

గృహ సారథుల ద్వారా ప్రజలకు మరిన్ని సేవలు

మండల కన్వీనర్ల ఇంచార్జ్ భాస్కర్ రెడ్డి

విశాలాంధ్ర-సంతబొమ్మాళి : గృహసారథుల ద్వారా ప్రజలకు మరిన్ని సేవలు అధికంగా అందించే విధంగా వైకాపా ప్రభుత్వం చర్యలు చేపట్టిందని, మండల కన్వీనర్ల ఇంచార్జ్ మోడీ భాస్కర్ రెడ్డి అన్నారు. శనివారం బోరుభద్ర సచివాలయం, మలగాం సచివాలయం పాలతలగాం సచివాలయాల పరిధిలో ఉన్న, ఆయా పంచాయితీల సర్పంచులు ఎంపీటీసీలు ఆధ్వర్యంలో గృహసారథుల నియామకాలను చేపట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, గృహ సారథులు ప్రజలకు వాలంటీర్లకు సచివాలయాలకు వారదులుగా పనిచేస్తారని, వారి సేవలను ప్రజలు వినియోగించుకోవాలని అన్నారు. ఈ సందర్భంగా గృహసరథులకు నియామక పత్రాలను అందజేశారు. అంతకుముందు ఆయా పంచాయితీల సర్పంచులు సూరాడ లక్ష్మీ వెంకటేష్, బుసకల లక్ష్మీకాంతం లక్ష్మయ్య, నకిట్ల అప్పన్న నరేష్, ఎంపీటీసీలు చింతాడ లక్ష్మీ చిన్నారావు, అట్టాడ అప్పలనాయుడు, ఆయా పంచాయితీల కార్యదర్శులు రాజేంద్ర, గోవిందు, వినోద్ లు, సచివాలయ ఉద్యోగులు భాస్కర్ రెడ్డిని పూలమాలలు దుస్సాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈకార్యక్రమంలో ఆయా పంచాయితీల వార్డు సభ్యులు, గృహరాసహారధులు, వాలంటీర్లు, వైకాపా నాయకులు, కార్యకర్తలు, ఆయా గ్రామాల పెద్దలు పాల్గొన్నారు.

ఉపాధి' చూపించకుంటే చర్యలు తప్పవు : డ్వామా పీడీ చిట్టి రాజు



విశాలాంధ్ర-శ్రీకాకుళం రూరల్: పని పూర్ణ వేతనదారులందరికీ ఉపాధిని ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలు మేరకు చూపించినట్లయితే చర్యలు తప్పవని జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ జివి చిట్టి రాజు సిబ్బందికి స్పష్టమైన హెచ్చరికలు జారీ చేశారు. శనివారం 30 మండలాలు చెందిన ఏపీవోలు ఈసీలు టెంకాయ అసిస్టెంట్లు కంప్యూటర్ ఆపరేటర్లతో సమీక్ష సమావేశాన్ని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనిదినాల కల్పనపై రాష్ట్ర అధికారులు ప్రతిరోజు సమీసిస్తున్నారని ఈ విషయంలో సిబ్బంది నిర్లక్ష్య ధోరణిని విడనాడి విధి నిర్వహణపట్ల ప్రత్యేక శ్రద్ధను చూపించాలని కోరారు. ప్రతి పంచాయతీ పరిధిలోను కనీసం 200 మంది కూలీలకు ఉపాధిని కల్పించాలని లక్ష్యాన్ని నిర్దేశించారు. ఈవిషయమే తప్పుడు సమాచారం ఇచ్చినట్లయితే సిబ్బందిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. గత నవంబరు నర నుండి పదేపదే సమీక్ష సమావేశాల ద్వారా ఆదేశాలు జారీ చేస్తున్నప్పటికీ నేటికీ పనుల ప్రగతి ఆశించిన స్థాయిలో లేదని పిడి ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లాలో వేతనదారులు ఎక్కువగా ఉన్నప్పటికీ పనిప్రదేశాల వద్ద వారి హాజరు ఎందుకు ఉండడంలేదని ప్రశ్నించారు. ఎందుకు క్షేత్రస్థాయి సిబ్బంది నిర్లక్ష్యమే ప్రధాన కారణమని ఆయన మండిపడ్డారు. 100 రోజుల పనిదినాలపై ప్రత్యేక శ్రద్ధ చూపించాలని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా రెండు పూటలా కూలీలు పనులు చేస్తున్న ఏకైక జిల్లా శ్రీకాకుళం అని, కానీ సగటు వేతనం తక్కువగా ఉండడం సిబ్బంది విధి నిర్వహణలో అసత్వానికి నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. సగటు వేతనం రూ. 250 కి తగ్గితే సహించేది లేదన్నారు. ఉపాధి పనులకు సంబంధించిన సక్సెస్ స్టోరీలు పంపించమని పదేపదే కోరుతున్నప్పటికీ ఎందుకు స్పందించడం లేదని మండల స్థాయి సిబ్బందిని ఆయన ప్రశ్నించారు. జాబ్ కార్డులకు ఆధార్ అనుసంధానం ప్రక్రియ త్వరగా పూర్తి చేయాలని కోరారు. ఈ సమావేశంలో సమన్వయ అధికారి అప్పలనాయుడు, ఏపీడి హరిత, పీడీ వెంట ఏపిఓ సీతారాం, జేఈ బాలముకుంద బాబు, డిబిటి మేనేజర్ విజయవాణి, ప్లాంటేషన్ సూపర్వైజర్ జి రామచంద్ర రావు, టెక్నికల్ అసిస్టెంట్ రత్నాకర్, రవి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

అత్యవసర పరిస్థితిలో ఆదుకున్న 'హృదయం ఫౌండేషన్'

విశాలాంధ్ర-సోంపేట : సోంపేట మండలం గ్రామానికి చెందిన ఓ పేద మహిళ పలాస ఆసుపత్రిలో అత్యవసర పరిస్థితుల్లో చికిత్స జరుగుతున్న సందర్భంలో ఓ నెగిటివ్ రక్తం అవసరమైంది. ఆసుపత్రి వైద్యుడు ఈ పరిస్థితుల్లో రక్తం కావాలని కోరిన వెంటనే సోంపేటకు చెందిన హృదయం ఫౌండేషన్ వెంటనే స్పందించి ఫౌండేషన్ వ్యవస్థాపకులు కర్రి మిన్నారావు, అధ్యక్షులు దుద్ది శ్రీనివాసరావు వెంటనే పలువురితో మాట్లాడి పలాసపురం గ్రామానికి చెందిన రెల్ల విక్కి అనే యువకునిచే ఓ నెగిటివ్ రక్తదానం చేయించారు. దీనిపట్ల సంస్థ ప్రతినిధులు విక్కికి కృతజ్ఞతలు తెలిపారు. హృదయం ఫౌండేషన్‌ను పలువురు అభినందించారు.

టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి...

విశాలాంధ్ర-కోటబొమ్మాళి : స్థానిక పీఏసీఎస్ అధ్యక్షుడు బాడాన మురళిధర్, మండల పరిషత్ ఉపాధ్యాక్షుడు దుక్క రోజారామక్రిష్ణ, కోటబొమ్మాళి మేజరు పంచాయతీ సర్పంచ్ కాళ్ల సంజీవరావు, సచివాలయ కన్వీనర్లు ఇన్‌చార్జీ గడ్డవలస నాగభూషణరావు ఆధ్వర్యంలో సంతబొమ్మాళి మండలం, సంతబొమ్మాళి పంచాయతీకి చెందిన బాడాన ఆనందరావు శనివారం ఎమ్మెల్సీ, టెక్కలి నియోజకవర్గ ఇన్‌చార్జీ దువ్వాడ శ్రీనివాస్ అధ్యక్షతన పార్టీలో చేరారు. దువ్వాడ శ్రీనివాస్ ఆనందరావుకు పార్టీ కండువ కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మండలవిప్ బొడ్డు అప్పన్న, సుంకరి జనార్ధనరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికి వైసీపీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందిస్తాం : మంత్రి డా.సీదిరి

విశాలాంధ్ర-మందస : అర్హులైన ప్రతి ఇంటికి వైసీపీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందిస్తామని రాష్ట్ర మత్స్య, పశుసంవర్ధక శాఖా మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. శనివారం మందస మండలం సరియాపల్లి పంచాయతీలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, ప్రభుత్వ సేవలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ప్రజ సమస్యలను వినతిపత్రాల ద్వారా స్వీకరించారు. ఈ సందర్భంగా మంత్రి డా.సీదిరి అప్పలరాజు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలోనే రాష్ట్రాభివృద్ధి చెందిందని అన్నారు. 2024 జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో జగన్‌కు ఓటు వేసి మళ్లీ ముఖ్యమంత్రి చేయాల్సిన బాధ్యత ప్రజలపై ఉందని అన్నారు. అనంతరం పల్లె నిద్ర చేశారు. కార్యక్రమంలో ఎంపిపి డొక్కరి దానయ్య, జెడ్‌పిటిసి సవర చంద్రమ్మ, తహశీల్దార్ బి.పాపారావు, ఎంపిడివో తిరుమలరావులు పాల్గొన్నారు.

కళింగుల పయనమెటు...?

విశాలాంధ్ర-పలాస : పలాస నియోజకవర్గంలో పలాస కాశీబుగ్గ జంట పట్టణాలు మినహా 94 గ్రామాల్లో గల 17,500 కుటుంబాలకు చెందిన 54వేల పైచిలుకు ఓటర్లు గల కళింగులకు ప్రస్తుతం రాజకీయ ప్రాధాన్యత కరువైందని, వారిలో అంతర్మధనం మొదలైనట్లు తెలుస్తోంది. అత్యధికంగా ఉన్న కాళింగులు తమకు జరిగిన అణచివేత దోరణికి విసుగు చెందుతున్నట్లు సమాచారం. వీరు మొదట నుంచి కాంగ్రెస్‌కు అనుకూలంగా ఉంటూ తరువాత వైసీపీకి కొమ్ము కాసినట్లు 2019లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో స్పష్టమైంది. అయితే అధికారం చేపట్టిన వైసీపీ ఈ నియోజకవర్గంలో కళింగులకు స్థానం లేకుండా పావులు కదపడంతో ఇటీవల కుల సమావేశం పార్టీలకు అతీతంగా నిర్వహిస్తూ తమ బలంను నిరూపించినట్లు ప్రచారం జరుగుతోంది. కాగా నాటి సోంపేట నేటి పలాస నియోజకవర్గంలో ఆది నుంచి కళింగుల అధిపత్యం కొనసాగుతూ వస్తుండేది. అయితే దానిని దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి, ప్రస్తుత ముఖ్యమంత్రి జగన్మోహన రెడ్డిలు గండికొట్టి నియోజకవర్గ స్వరూపాన్ని మార్చినట్లు వారు భావిస్తున్నారు. ఇదిలా ఉండగా గత తెలుగుదేశం ప్రభుత్వంలో కొంత మంది కళింగులు ప్రజాస్వామ్య బద్ధంగా నిరసన తెలియజేసిన తరుణంలో వారిని అడ్డుకోవడమే కాకుండా అధికార జూలుం ప్రదర్శించి కేసులు పెట్టి కోర్టు చుట్టూ తిప్పిన సంఘటనలు ఇంకా కళింగుల్లో నిస్తేజమై ఉంది. ఆ సమయంలోనే ఒక సున్నితమైన అంశాన్ని స్పృశించి అప్పటి తెలుగుదేశం పార్టీకి చెందిన కళింగులు సమావేశమై కులాన్ని విభజించే ప్రయత్నం చేసిన సంఘటన వారు మర్చిపోలేక పోతున్నారు. ఈ నేపథ్యంలో అధికార, ప్రతిపక్ష పార్టీలకు కళింగులు ఎవరికి అనుకూలంగా వ్యవహరిస్తారో శేషప్రశ్నగా మిగిలింది. ఒక వేళ ఎటు వైపు కాకుండా ప్రత్యామ్నాయ దిశగా అడుగులు వేయాలని అలోచిస్తున్నట్లు సమాచారం. ప్రస్తుతం వీరి మద్దతు తెలుగుదేశంకు ఉందని వారు, వైసీపీకి ఉందని వీరు అనుకొని కళింగులను త్రిశంకు స్వర్గంలో వదిలేశారని వారు భావిస్తున్నట్లు బోగట్టా. రాబోయే ఎన్నికల సమయంలో నియోజకవర్గంలో కళింగులదే నిర్ణయాత్మక పాత్ర కాలగదని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు. ఎన్నికల ముందు కళింగుల మనోగతం ఎలా ఉంటుందో వేచిచూద్దాం.

ముమ్మరంగా లబ్దిదారుల సంతకాల సేకరణ

విశాలాంధ్ర-శ్రీకాకుళం రూరల్ : జగనన్న కాలనీ, టిట్కో గృహాల లబ్దిదారులతో సీపీఐ శ్రేణులు సంతకాలు సేకరణను ముమ్మరంగా చేస్తున్నారు. పాత్రునివలసలో శనివారం పాత్రునివలస సీపీఐ శాఖా కార్యదర్శి బలగ రామారావు ఆధ్వర్యంలో సంతకాలు సేకరణ కార్యక్రమం చేపట్టారు. లబ్దిదారుల ఇంటింటికీ వెళ్లి వారి సంతకాలు సేకరించడంతోపాటు ఈనెల 30వ తేదీన తహశీల్దార్ కార్యాలయాల వద్ద జరిగే ధర్నా, ఫిబ్రవరి 6వ తేదీన కలెక్టరేట్‌ల వద్ద ధర్నా, ఫిబ్రవరి 22న విజయవాడలో నిర్వహించే మహాధర్నాలో లబ్దిదారులు పాల్గొనాలని, మనం చేసే పోరాటం ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలంటే సీపీఐ నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాలను జయప్రదం చేయాలని ఆయన లబ్దిదారులను కోరారు. ఈ కార్యక్రమంలో ముడిదాన భాస్కరరావు, కారిగి కృష్ణ, బలగ లావణ్య, బలగ వరలక్ష్మీ, బలగ లక్ష్మీ, బి. గణేష్, కె. దయామణి, ముడిదాన వరహాలమ్మ, టి. త్రివేణి, బి. పోలమ్మ, చింతాడ చిన్ని, పంచిరెడ్డి అప్పారావు, చింతాడ అర్జునుడు, చింతాడ పోలమ్మ తదితరులు ఉన్నారు.

వ్యక్తిత్వ వికాసంపై సదస్సు

విశాలాంధ్ర-ఆమదాలవలస : ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆమదాలవలసలో డిపార్ట్మెంట్ ఆఫ్ యూత్ సర్వీసెస్, సెట్ శ్రీస్పోర్ట్స్ శ్రీకాకుళం జిల్లా వారిచే వ్యక్తిత్వ వికాసం, విద్యా, ఉద్యోగం, ఆటలు పై విద్యార్థినీ విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వ హించారు. ఈ కార్యక్రమం జాతీయ సేవా పథకం అధికారి జలుమూరు రవిబాబు చే నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ బి.శ్యామ సుందర్ అధ్యక్షత వహించగా, వి.వి.అప్పల నాయుడు, మేనేజర్ సెట్ శ్రీ, శ్రీకాకుళం ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రసంగించారు. యువజన సర్వీసుల శాఖ ద్వారా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వ్యక్తిత్వ వికాసం, కెరీర్ గైడెన్స్‌లో అవగాహన కల్పిస్తుందని,ఉన్నత విద్య, భవిష్యత్తు లక్ష్యాలను సాధించేందుకు ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించుకునేందుకు, అంతర్గత వ్యక్తిత్వ వికాసానికి కౌన్సిలింగ్ ఇవ్వ బడుతుందని, ఇంటర్వ్యూలను ఎదుర్కోవడానికి మరియు కమ్యూనికేషన్ స్కిల్స్ పెంపొందించు కోవడానికి విద్యార్థులకు మరియు నిరుద్యోగ యువతకు కౌన్సిలింగ్ ఇవ్వబడుతుందని సూచించారు. ఈకార్యక్రమంలో భాగంగా విద్యా ఉద్యోగ దీపికను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థిని విద్యార్థులతోపాటు ఎల్.వి. నాయుడు, స్పెషల్ డిప్యూటీ సిల్దార్, కే.వి. రమణ, అసిస్టెంట్ మేనేజర్, కే. గీత ఫీల్డ్ ఆఫీసర్ లతోపాటు అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

కోరం లేక స్కూల్ మేనేజ్మెంట్ కమిటీ ఎన్నిక వాయిదా : ఎంఈఓ

విశాలాంధ్ర-ఆమదాలవలస : ఆమదాలవలస గతంలో ఆగిపోయిన స్కూల్ మేనేజ్మెంట్ కమిటీ ఎన్నిక గురించి నోటీసు ఇచ్చినప్పటికీ, కోరం సరిపోక ఆగిపోయినట్లు విద్యార్థుల తల్లిదండ్రుల కమిటీ సభ్యులు హాజరు కాకపోవడం వల్లనే ఎన్నిక నిలిచిపోయినట్లు తెలిపారు. మండల పరిధిలో బొబ్బిలి పేట, పీర్ సాహెబ్‌పేట పాఠశాలల అభివృద్ధి కోసం కమిటీ లేనందున ఏవిధమైన నిధులు కానీ, నాడు నేడు పనులు గాని మంజూరు చేయబడవని తెలిపారు. పలుమార్లు ఎన్నికల కోసం నోటిఫికేషన్లు ఇస్తున్నప్పటికీ ఈ రెండు చోట్ల నేటికీ ఎస్ఎంసి లేదని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారులు దువ్వల రామారావు, ఏపిఎం పైడి కూర్మా రావులతోపాటు ఎంఆర్‌సి సిబ్బంది బొడ్డేపల్లి రఘు, రమణ, నర్సింగరావు పాఠశాల ప్రధానోపాధ్యాయులు మెట్ట సన్యాసిబట్లు, నూక అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

కవులు కళాకారుల ద్వారానే చరిత్ర మనుగడ

6 జిల్లాల వేదికగా రచయితల మహాసభ

విశాలాంధ్ర-పలాస: కవులు, రచయితలు, కళాకారుల ద్వారానే చరిత్ర మనుగడ సాగుతుందని సాహిత్యం, సంస్కృతి సాంప్రదాయాలు మహాకవుల రచనలు మరుగున పడకుండా వాటిని వెలికి తీయాలనే లక్ష్యంతో ఉద్దానం సాంస్కృతిక వేదిక కృషి చేయడం అభినందనీయమని పలాస కాశీబుగ్గ మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు, మాజీ చైర్మన్ వజ్జ బాబూరావులు అన్నారు. శనివారం స్థానిక ఎస్ఎంసి కళ్యాణ మండపంలో ఉద్దాన సాహితీ సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన ఉత్తరాంధ్ర తెలుగు రచయితల మహాసభలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలను కొత్తగా రచనలు చేసే రచయితలను చైతన్యం పర్చడానికి ఈ సభలు దిక్సూచిగా పని చేస్తాయని అన్నారు. పాత్రికేయులు ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడం అభిలషనీయమని అన్నారు. సమాజంలో రచనలు బ్రతికున్నంత వరకు విద్యావ్యవస్థ సక్రమ మార్గమంలో ఉంటుందని, ఉత్తరాంధ్ర యాస, భాష ఇందుకు చక్కని నిదర్శనమని అన్నారు. రచయితల సంఖ్య నానాకి తగ్గడం భాదాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ఉత్తరాంధ్ర నాటక రూపాలు అనే అంశంపై దళిత సాహిత్యకారులు పరిశోధకులు జయధీర్ తిరుమలరావు మాట్లాడుతూ ప్రజా కళలు ఉత్తరాంధ్ర ప్రత్యేకతని, కళలు, సాంప్రదాయ కళలు అంతరించకపోకముందు వాటిని డాక్యుమెంట్ చేసి బ్రతికించాలని అన్నారు. కళలు బ్రతికితేనే కళాకారుడు బ్రతుకుతాడని, వ్యక్తిగత దోరణీ పోవాలంటే సామూహిక కళను బ్రతికించుకోవాలని అభిప్రాయ పడ్డారు. శ్రీకాకుళ రంగ స్థల కళాకారుల సమాఖ్య అధ్యక్షులు చిట్టి వెంకటరావు మాట్లాడుతూ సమాజానికి మార్గదర్శికుడు కళాకారుడని, వారిని బ్రతికించుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందని అన్నారు. రచయిత డాక్టర్ అందేశ్రీ మాట్లాడుతూ ఉత్తరాంధ్రుల రచయితల సాహిత్యానికి పూర్వ వైభవం తీసుకొచ్చి ప్రపంచ పటంపై నిలపాలని కోరారు. సూర్యతేజ కళాశాల ప్రిన్సిపాల్ దానేటి పద్మ, జానపద కళాకారుడు కుమార్ నాయిక్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వేదిక అధ్యక్షులు లండ రుద్రమూర్తి, ప్రధాన కార్యదర్శి సి.హెచ్.జగదీష్, గౌరవ సలహాదారులు తెప్పల క్రిష్ణమూర్తి, కార్యనిర్వాహక ఉపాధ్యక్షులు కుత్తుము వినోద్, కార్యదర్శి శివజ్యోతి, గౌరవాధ్యక్షులు వంకల రాజారావు, బందారి కాళిదాసు, జి.గౌరీనాయుడులు పాల్గొన్నారు.

24న జాబ్ మేలా

విశాలాంధ్ర-ఎచ్చర్ల : ఏపీఎస్ఎస్‌డిసి, సిడాప్ ఉపాధి కల్పన శాఖలు సంయుక్తంగా ఈనెల 24న శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో నెహ్రూ యువ కేంద్రంలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి మేనేజర్ శ్రీనివాస్ తెలిపారు. దక్కన్ ఫైన్ కెమికల్స్, పెట్రో ల్యాబ్స్, ఆటోమొబైల్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థల్లో ఉద్యోగాలకు జాబ్ మేలా నిర్వహిస్తున్నామన్నారు. ఆసక్తి అర్హతగల అభ్యర్థులు మరిన్ని వివరాల కోసం ఫోన్ నెంబర్లు 9502825143, 6301045132కు సంప్రదించాలన్నారు.

సరుబుజ్జిలిలో కుక్కల స్వైర్య విహారం

విశాంధ్ర-సరుబుజ్జిలి : సరుబుజ్జిలిలో కుక్కల బెడద ఎక్కువయ్యింది. కుక్కలు గుంపులుగా వచ్చి బస్సు స్టాండ్ లోను, కాఫి దుకాణాలలోను వేచి ఉండే ప్రయాణికులపై విరుచుకు పడుతున్నాయి. ద్విచక్ర వాహనుదారులు సరుబుజ్జిలి దాటాలంటే వెన్నులో భయం పుడుతుందని వాపోతున్నారు. స్థానికులు విధుల్లోకి కర్ర తోడు తీసుకోని రావలిసిందే. అధికారులు జోక్యం చేసుకొని కుక్కల బెడద నుండి ఉపశమనం కల్పించాలని స్థానికులు కోరుతున్నారు.

కిషోర బాలికలు ఆరోగ్యం కలిగి ఉండాలి

విశాలాంధ్ర-పొందూరు : కిశోర బాలికలు ఆరోగ్య భాగ్యంతో కలిగి ఉండాలని ఐసిడిఎస్ ప్రాజెక్ట్ పరిధిలోగల కింతలి సెక్టార్ సూపర్వైజర్ జివి రత్నం అన్నారు. కింతలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అంతర్జాతీయ బాలిక దినోత్సవం సందర్భంగా నిర్వహించే సమావేశంలో మాట్లాడుతూ ఆటపాటలతో ఆనందాన్ని గడిపి 11 నుండి 18 సంవత్సరాల వయస్సు కలిగిన కిషోర్ బాలికలు మంచి పౌష్టికాహారం తో ఆరోగ్యాన్ని పెంపొందించుకునేందుకు ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని ఆమె అన్నారు. బాలిక మేధాశక్తిని విద్యాభివృద్ధి పెంపొందించడానికి పలు సూచనలు సలహాలు అందించారు. ప్రతి బాలిక రక్తసాతాన్ని పెంపొందించుకుని ఆరోగ్య వంతురాలుగా ఉండాలని ఆమె కోరారు. వ్యాధి నిరోధిక శక్తిని పెంపొందించేందుకు సూచనలను సలహాలను అందించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎమ్ బి గోవిందరావు, హెచ్ వి తిరుమల సెక్టార్ పరిధిలోగల అంగన్వాడి వర్కర్స్ చంద్రావతి సంతోషి రమణమ్మ జయలక్ష్మి చిన్నమ్మడులతోపాటు పలువురు ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

సర్కారు వైద్య సేవలు సద్వినియోగం చేసుకోండి

విశాలాంధ్ర-పొందూరు : రాష్ట్ర ప్రజలు సుభిక్షంగా నిలవాలన్న తపనతోసర్కార్ కోట్లాది రూపాయలు వెచ్చించి వైద్య సేవలు అందిస్తున్న దృశ్య గ్రామీణ రోగులు సద్వినియోగం చేసుకోవాలని వైద్యాధికారులు పి.శివశంకర్ మణికంఠలు ప్రజలకు కోరారు. మండలం రాపాక గ్రామంలో శనివారం హెల్త్ వెల్నెస్ కేంద్రంలో 104 వాహన వైద్య సేవలను అందించారు. ఇంటింటా రోగులకు పరీక్షలు జరిపారు. గర్భిని బాలింతల నుండి రక్త నమూనాలను సేకరించారు. బిపి షుగర్ దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడే రోగులకు అవసరమైన పరీక్షలు నిర్వహించి మందులను అందించారు. ఈ కార్యక్రమంలో ఎం ఎల్ హెచ్ పి లావణ్య, జ్యోష్ణ, ఏఎన్ఎం ఉదయలక్ష్మి, వనజాక్షి, హెల్త్ అసిస్టెంట్ ఆర్ వెంకట రమణారావు, డీఈవో శ్రీనివాసరావు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల చేయూత

విశాలాంధ్ర-కంచిలి : మండలంలోని ఎమ్మెస్ పల్లి ఉన్నత పాఠశాలకు చెందిన కళ్యాణ్ మోహన్ అనారోగ్యంతో బాధపడుతుండడంతో పూర్వ విద్యార్థులు చేయూత అందించారు. కళ్యాణ్ మోహన్ అనారోగ్యంతో బాధపడుతూ ఒడిస్సా భువనేశ్వర్‌లో చికిత్స పొందుతున్నాడు. అతడి స్వగ్రామం అంతరసింగి. నిరుపేద కుటుంబం కావడంతో అతడు వైద్యానికి ఇబ్బంది పడుతున్న సంగతి తెలుసుకొని పూర్వ విద్యార్థులు సహాయం చేశారు. 2001 విద్యా సంవత్సరానికి చెందిన లోహిదాసు, పురుషోత్తం, అశ్విన్లు విరాళాలు సేకరించి ఆరువేల రూపాయలను కళ్యాణ్‌మోహన్ కుటుంబ సభ్యులకు అందజేశారు. పూర్వ విద్యార్థుల చేయూతను గ్రామస్తులు అభినందించారు.

క్యాన్సర్‌పై అవగాహన

విశాలాంధ్ర-బూర్జ : ప్రాథమిక ఆరోగ్య కేంద్రం గుత్తావల్లి ఆధ్వర్యంలో శనివారం క్యాన్సర్ పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆరోగ్య కేంద్రం వైద్యురాలు డాక్టర్ పావని మాట్లాడుతూ క్యాన్సర్ అనేది అన్ని వయసుల వారికీ రావొచ్చునని, ఈ మధ్యకాలంలో మహిళలకు గర్భశయ క్యాన్సర్, మగవారికి ఊపిరితిత్తులు క్యాన్సర్ అధికంగా వస్తుందని, క్యాన్సర్ ముఖ్యముగా పొగ త్రాగటం, ఆల్కహాలు సేవించటం మరియు ఆహారపు అలవాట్లు మార్పుల వల్ల అంటే జంక్ ఫుడ్స్ తీసుకోకపోవడం వలన క్యాన్సర్ అధికంగా వస్తుందని పేర్కొన్నారు. ముందుగా వ్యాధి లక్షణాలును గుర్తించి మందులు తీసుకుంటే క్యాన్సర్ వ్యాధి బారిన పడకుండా ఉండవచ్చుని తెలిపారు. ఈ కార్యక్రమంలో పీహెచ్ సీ సీహెచ్ఓ అప్పలస్వామి,ఫార్మాసిస్ట్ గురుమూర్తి,స్టాఫ్ నర్స్ నారాయణమ్మ, ఏయన్‌యమ్ లు, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

రథసప్తమికి బాలలకు సకల ఏర్పాట్లు చేయండి

రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యులు సీతారాం

విశాలాంధ్ర-అరసవల్లి : రథసప్తమి సందర్భంగా ఈనెల 28న అరసవెల్లి శ్రీ సూర్యనారాయణ దేవస్థానం అధికారులు బాలలకు శత శాతం యుపయుక్తంగా ఉండే అన్ని సౌకర్యాలు కల్పించాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొండు సీతారాం ఆదేశాలు జారీ చేశారు. శనివారం శ్రీకాకుళం జిల్లాలో పర్యటనలో ఉన్న ఆయన అరసవెల్లి దేవస్థానానికి చేరుకొని రథసప్తమి రోజున దేవస్థానం, కార్మిక శాఖ, వైద్య, ఆరోగ్య శాఖ, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ తదితర శాఖల అధికారులు బాలల సౌకర్యాల కల్పనపై ఎటువంటి ఏర్పాట్లు చేస్తున్నారో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమీక్షలో సీతారాం మాట్లాడుతూ దేవస్థానంలో ఇప్పటివరకు చైల్డ్ ప్రొటెక్షన్ పోలసీని అమలుచేస్తున్నారా, గతంలో ఇటువంటి భారీ ఉత్సవాలు జరిపినప్పుడు పిల్లలకోసం అమలు చేసిన సౌకర్యాలపై ఆరా తీశారు. గత ఏడాది నిర్వహించిన రథసప్తమికి సుమారుగా ఎంతమంది బాలలు హాజరై ఉంటారన్న అధికారిక, అనధికార లెక్కలు కల్గి ఉన్నారా, ఈ ఏడాది సుమారు ఎంతమంది పిల్లలు హాజరు కాగలరన్న అంచనాలు కల్గి ఉన్నారా, తల్లి తన పిల్లలకు పాలు అందించే ప్రత్యేక షెల్టర్లు ఎన్ని ఏర్పాటు చేస్తున్నారు, ఎక్కడ ఏర్పాటు చేస్తున్నారు. పిల్లలు ప్రత్యేకంగా దర్శనాలు చేసుకునేందుకు వరుస లైన్లు ఏర్పాటు చేస్తున్నారా, దర్శన సమయంలో, లైన్లులోనూ పిల్లలు అనారోగ్యం పాలైతే తక్షణ ప్రాథమిక వైద్య సాయం అందించేందుకు చిన్న పిల్లల వైద్యులు కల్గి ఉండేలా ప్రణాళికతో సెంటర్లు ఏర్పాటు చేస్తున్నారా, చంటి పిల్లలకు పాలు, ఎటువంటి ఆహార పదార్థాలు అందించడంపైనా, ఆలయ లైన్లలోనూ, బయట బాల యాచకులు లేకుండా కార్మిక శాఖతో కలసి తీసు కుంటున్న చర్యలపై అడిగి తెలుసుకున్నారు. అనంతరం కమిషన్ సభ్యులు సీతారాం మాట్లాడుతూ వేలాదిగా తరలివచ్చే భక్తులతో సమానంగా పిల్లలకు సౌకర్యవంతమైన సదుపాయాలు కల్పించాల్సిన భాధ్యత దేవాదాయ శాఖ అధికారులతో పాటు ఇతర శాఖల అధికారులపైన ఉందని గుర్తు చేశారు. ఉత్సవాలను తాము ప్రత్యేక దృష్టితో చూడనున్నామని గుర్తు చేశారు. బాలల హక్కుల ఉల్లంఘనలు జరిగినట్టు తమ దృష్టికొస్తే తక్షణమే శాఖాపరమైన చర్యలకు ఆదేశాలిచ్చేందుకు కమిషన్ సిద్ధంగా ఉంటుందన్నారు. అరసవల్లి దేవస్థానం కార్యనిర్వహణాధి కారి వి.హరి సూర్యప్రకాష్ మాట్లాడుతూ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు సీతారాం సమీక్షించిన ప్రతీ అంశాన్ని పరిగణలోనికి తీసుకొని బాలలందరికీ ఆమోదయోగ్యమైన సదుపాయాలు కల్పించే దిశగా అన్ని ప్రభుత్వ శాఖల సమన్వయంతో అడుగులు వేస్తామన్నారు. ఈ సమీక్షలో జిల్లా ఇన్చార్జి వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ అనురాధ, డిప్యూటీ లేబర్ కమిషనర్ ఎస్.డి.వి. ప్రసాదరావు, సీఆర్పీఎఫ్ జిల్లా కన్వీనర్ కొత్తకోట శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి మొదలవలస వాసుదేవ కుమార్, పి.శేఖర్,డాక్టర్ జగ్గారావు, సింగూరు ప్రవీణ్ కుమార్, మోహిని, బి.ప్రవీన్ తదితరులు పాల్గొన్నారు.

తనపై, తన కుటుంబంపై వ్యాఖ్యలు తగవు : గొండు శంకర్

విశాలాంధ్ర-శ్రీకాకుళం రూరల్: ఇటీవల తన కుటుంబం పై, తన వ్యక్తిత్వం పై మీడియాలో కొంతమంది వ్యక్తులు చేస్తున్న వ్యాఖ్యలపై మనస్థాపంతో తీవ్రంగా ఖండిస్తూ వాస్తవాలను నియోజకవర్గ ప్రజలకు, తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులకు పార్టీ కార్యకర్తలకు, నాయకులకు తెలియజేయాలనే ఉద్దేశంతోనే మీడియా ముఖంగా మాట్లాడుతున్నానని శ్రీకాకుళం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ యువ నాయకులు, జిల్లా సర్పంచ్ సంఘ అధ్యక్షుడు గొండు శంకర్ అన్నారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. టీడీపీ ఆవిర్భా వం నుంచి తమ కుటుంబం అదే పార్టీలో ఉంటూ పార్టీ పురోభివృద్ధికి కృషి చేస్తూ వస్తోందని గొండు శంకర్ అన్నారు. 40 ఏళ్లకు పైగా తమ కుటుంబం తెలుగుదేశం పార్టీలో క్రియాశీలకంగా పనిచేస్తూ, పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు మరింత ఎక్కువగా శ్రమిస్తూ ఉన్నఇప్పుడు అసమ్మతివాదిగాను, అసంతృప్తి వాదిగాను. వెన్నుపోటుదారునిగాను చిత్రీకరించేందుకు కొందరు ప్రయత్నిస్తూ తప్పుడు ప్రచారం చేస్తున్నారని, దానిని తమ కుటుంబం తీవ్రంగా ఖండిస్తుంద`న్నారు. టిడిపి జాతీయ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మళ్లీ ముఖ్యమంత్రి కావడమే లక్ష్యంగా గ్రామ గ్రామాణ, వీధి వీధిన ప్రజలకు వెళ్లి కలుసుకుంటే తప్పు ఏమిటని గొండు శంకర్ అన్నారు. తమకు టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కింజరాపు అచ్చెన్నాయుడు, పార్లమెంట్ సభ్యులు కింజరాపు రామ్మోహన్నాయుడు, టిడిపి జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్ మద్దతు ఉన్నట్టు చేస్తున్న ప్రచారం నూటికి నూరుపాళ్లు అవాస్తవమన్నారు. తమ కుటుంబం తెలుగుదేశం పార్టీలో 40 ఏళ్లుగా నమ్మకంతో పనిచేస్తుందని అన్నారు. పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు పనిచేసిన తమ కుటుంబంపై అసమ్మతి, అసంతృప్తి, వెన్నుపోటు వంటి పదాలతో తప్పుడు ప్రచారాలు చేయడం, గ్రూపు రాజకీయాలు చేస్తున్నామంటూ తమపై నిందలు మోపడం ఎంతమాత్రం తగదన్నారు. పార్టీలో 40 ఏళ్లుగా ఉన్న తమ కుటుంబం జనం మధ్యకు వెళ్లి జనం కోసం పనిచేయడం, పార్టీలో క్రమశిక్షణ గల కార్యకర్తగా యువతకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరుతూ టిక్కెట్ ఆశిస్తే తప్పు ఏమిటన్నారు. పార్టీ హైకమాండ్, పార్టీ జాతీయ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు నారా చంద్రబాబునాయుడు, నారా లోకేష్, ఇతర పెద్దల అభిప్రాయాల మేరకు పార్టీ కోసం పనిచేయడమే తమ లక్ష్యమన్నారు. పార్టీ ఏ నిర్ణయం తీసుకున్నా ఇప్పటి వరకు కట్టుబడి ఉన్నామని, ఇకపై అదే రీతిలో ఉంటామని గొండు శంకర్ చెప్పారు.

రైతుకు మాయ చేసే సర్కార్‌కి గోడీ కట్టండి

రైతాంగానికి కూన పిలుపు

విశాలాంధ్ర-పొందూరు : కల్లబొల్లి కథలు చెప్పి నంగనాచి మాటలతో రాష్ట్ర రైతాంగానికి మోసం చేసిన దగాకోరు ప్రభుత్వానికి ఘోడి కట్టాలని శ్రీకాకుళం జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు కూన రవికుమార్ రైతు సోదరులకు పిలుపు నిచ్చారు. మండలం మల్కామ్ గ్రామంలో నిర్వహించే ఓ కార్యక్రమంలో పాల్గొని పైవిధంగా అన్నారు. రాష్ట్ర రైతాంగానికి మాయదారి మాటలతో మభ్యపెట్టి తీవ్ర ద్రోహం చేస్తున్నారని మండిపడ్డారు. రైతాంగం నుండి ప్రతి గింజ సర్కారు కొనుగోలు చేస్తామని గొప్పలు చెప్పిన శ్రీకాకుళం జిల్లా మంత్రివర్యులారా మాటలు గారడీలు కాదు చేతలలో చూపించండిని హెచ్చరించారు. రాష్ట్ర రైతాంగం 11 లక్షలు పన్నుల పండిస్తే? మీరు నాలుగు లక్షల టన్నులు కొనుగోలు చేస్తా మంటే ? మిగిలిన ధాన్యం ఏమి చేయమంటారు అంటూ హెచ్చరించారు. జిల్లాలో పండిన వరి పూర్తిస్థాయిలో కొనుగోలు చేయక పోతే మొత్తం ధాన్యాన్ని ఈ మంత్రులు ఇళ్ళ ముందు పోస్తామని హెచ్చరించారు. రైతు కష్టించి పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేయడంలో సర్కారు పూర్తిగా విఫలమైందని విమర్శించారు. తడి పోడిల పేరుతో రైతు శ్రమ దోపిడీ చేస్తున్న ఈ డెమో బస్సు పాలనకు బుద్ధి చెప్పాలని రైతాంగానికి పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో జిల్లా తెలుగు యువత కార్యదర్శి బలగ శంకర్ భాస్కర రావు, మల్కం సర్పంచ్ జాడ శ్రీనివాసరావు, మధు వెంకటరావు పలువురు రైతులు పాల్గొన్నారు.

ఘనంగా గణతంత్ర దినోత్సవ క్రీడా పోటీలు

విశాలాంధ్ర-కవిటి : మండలం జడ్పిహెచ్ఎస్ బిజి పుట్టుగలో గణతంత్ర దినోత్సవ సందర్భంగా బాల బాలికలకు కబాడీ,వాలీబాల్, బ్యాడ్మింటన్, అథ్లెటిక్స్‌తో పాటు డిబేట్, క్విజ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు హెచ్ఎం టి.ఖగేశ్వరరావు తెలిపారు. ఈ పోటీలు గత మూడు రోజుల నుండి నిర్వహిస్తున్నట్లు పీఈటి రమేష్ తెలిపారు. ఈ పోటీలకు ఉపాధ్యాయులు బాబురావు, భవాని, ప్రసాద్, వైకుంఠరావు, సరళ, జానకి, జ్యోత్స్న సహకరిస్తున్నారని తెలిపారు.

చదువే మార్పునకు మూలం

- అసమానతలు తొలగింపునకు విద్యే కీలకం
- రెవెన్యూ, రిజిస్ట్రేషన్, స్టాంపుల శాఖా మంత్రి ధర్మాన ప్రసాదరావు

విశాలాంధ్ర-శ్రీకాకుళం స్పోర్ట్స్/క్రైం: చదువే మార్పునకు మూలం అని, సమాజ వికాసానికి ప్రగతికి దోహదకారి అని రెవెన్యూ శాఖా మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. స్థానిక బాపూజీ కళా మందిరంలో కళింగ కోమటి కార్పొరేషన్ చైర్మన్ అంధవరపు సూరిబాబు నేతృత్వాన పదో తరగతి పిల్లలకు స్టడీ మెటీరియల్ ను పంపిణీ చేశారు. మున్సిపల్ కార్పొరేషన్ (శ్రీకాకుళం) పరిధిలో ఉన్న అన్ని ఉన్నత పాఠశాలలకు చెందిన నాలుగు వందల మంది విద్యార్థులకు ఈ మెటీరియల్ ను అందించి, వారి ఉన్నతికి కృషి చేస్తున్న సూరిబాబును అభినందించారు. తన జీతాన్ని (గౌరవ వేతనంను) ఈ విధంగా ఏటా సామాజిక కార్యక్రమాలకు వెచ్చించడం ఎంతో గొప్ప విషయమని అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..కళింగ కోమటి కార్పొరేషన్ చైర్మన్ అంధవరపు సూరిబాబు తన పుట్టిన రోజును పురస్కరించుకుని కార్పొరేషన్ పరిధిలో ఉన్న మున్సిపల్ కార్పొరేషన్ స్కూల్ 10 వ తరగతి విద్యార్థులకు పరీక్షలు కోసం మెటీరియల్ ఇవ్వడం ఆనందదాయకం, శుభ పరిణామమన్నారు. ఇందులో పాల్గొంటున్న ప్రతి ఒక్కరికీ నా శుభాకాంక్షలు. విద్యార్థులకు నా దీవెనలు అన్నారు.

చైతన్యవంతమైన సమాజం నిర్మాణం కోసం విద్య అవసరం. ఆర్థిక అసమానతలు, సామాజిక వ్యత్యాసాలు తొలగించేందుకు విద్య ఒక్కటే ఆయుధమని, ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మొదటి రోజు నుంచే విద్య విషయమై ఎక్కువ ఖర్చు చేస్తున్నామన్నారు. ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాన్ని సమాజం గమనించిందన్నారు. ప్రజల అవసరాలను తీర్చడం కోసం ప్రభుత్వం ఎప్పుడూ అండగా ఉంటుందని, పిల్లలు ఓటు వేస్తారని కాదు.. భావిభారత పౌరులను తీర్చిదిద్దే క్రమాన పోటీ ప్రపంచానికి అనుగుణంగా రాణించేందుకు వీలుగా వారికి నాణ్యమయిన విద్యను అందించడం అన్నది ఇవాళ ప్రభుత్వ ధ్యేయమన్నారు. సమాజంలో ఉండే వ్యత్యాసాలు, అసమానతలు తొలగించి చైతన్యవంతమైన సమాజం నెలకొల్పేందుకు రేపటి వేళ కృషి చేస్తారని ఇంత ఖర్చు చేస్తున్నామన్నారు.

విద్యార్థులకు ఇప్పుడు ఇస్తున్న మెటీరియల్ ను తప్పకుండా ఫాలో అవ్వండి. ఈ వయస్సులో అశ్రద్ధ వద్దు. గురువులు, తల్లిదండ్రులు చెప్పిన మాట తప్పకుండా వినాలని, మీ బంగారు భవితకు బాటలు వేసుకోవాలని, వైఎస్సార్ కాంగ్రెస్ హయాంలో నడుస్తున్న ప్రభుత్వం విశాల దృక్పథంతో పని చేస్తుందని అందరూ గమనించాలన్నారు.

సీఎం జగన్ ను సైకో అంటున్నారని, సైకో అయితే ఇన్ని మంచి పనులు చేస్తారా ? సరైన ప్రయత్నాన్ని అడ్డుకుంటే వాళే అసలైన సైకోలని, అలాంటి వారికి ఇదే నా హెచ్చరిక అన్నారు. ఇకపై ఇటువంటి దూషణలు మానుకోవాలని అన్నారు. అదేవిధంగా అసత్య ప్రచారాలు మానుకోవాలని, రాష్ట్ర ప్రభుత్వం అన్ని కార్పొరేషన్ల చైర్మన్ల పదవీ కాలం పొడిగిస్తూ ఉత్తర్వులు శనివారం ఇ చ్చిందన్నారు. ఇది ఒక శుభ పరిణామం అన్నారు. సూరిబాబు ఆయనకి ఇస్తున్న గౌరవ వేతనంను పేద వైశ్య కుటుంబాలకు అందిస్తున్నారని, ఇటువంటి చొరవ ఎంతైనా అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ చల్లా ఓబులేశు, రెడ్ క్రాస్ చైర్మన్ జగన్ మోహన్ రావు, సాధు వైకుంఠ రావు, మాజీ మున్సిపల్ చైర్మన్ మెంటాడ పద్మావతీ, కోనర్క్ శ్రీనివాసరావు, గురుగుబెల్లి లోకనాథం, అంధవరపు ప్రసాద్, సంతోష్, మండవిల్లి రవి, వి. నాగరాజు, గుడ్ల దాము, చల్లా అలివేలు మంగ తదితరులు పాల్గొన్నారు.

సహజ వనరులతో కషాయాలు తయారీ

విశాలాంధ్ర-గార: మండలం నైర గ్రామంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ఆధ్వర్యంలో రైతులు మొక్కజొన్న పంటకు అగ్నిఅస్త్రం కషాయాన్ని రైతు భరోసా కేంద్రం వద్ద తయారుచేసుకున్నారు. ముఖ్యంగా ఈ కషాయం తయారీలో రైతులకి ఏ విధమైన ఖర్చు ఉండదని, ఈ కషాయాన్ని పంటల పై పిచికారి చేయడం వలన పంటను ఆశించే గొంగళి పురుగులు మరియు కాండం తొలుచు పెద్ద పురుగుల నుంచి పంటను కాపాడుకోవచ్చని ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ఈశ్వర్, డిల్లేశ్వరావు లు రైతులకు వివరించారు. అలాగే రైతులకి రసాయన పురుగుమందులు కి అయ్యే పెట్టుబడి ఖర్చు ఈ ప్రకృతి సేద్య విధానంలో తయారుచేసిన కషాయాలను ఉపయోగించడం వలన పంట పెట్టుబడి తగ్గి దిగుబడి వస్తుందన్నారు. ప్రకృతి వ్యవసాయం లో పంటలు పండించడం చాలా సులభతరమని, ఈ సహజ సేద్య పద్ధతిలో రైతులందరూ పంటలను పండిచాలని రైతులకి సూచించారు. ఈ కార్యక్రమంలో వీఏఏ పల్లవి, కర్రి కృష్ణమోహన్, రైతులు పాల్గొన్నారు.